కాలుష్య కాసారాలుగా కాలువ గట్లు

- గట్లపైనే ఆసుపత్రి, కోళ్ల వ్యర్థాలు
- సెప్టిక్‌ట్యాంక్ వ్యర్థాల డంప్
- దుర్గంధంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం
- చెత్త పేరుకుపోయి జలాలు కలుషితం



మురమళ్ల రాఘవేంద్ర వారధి కుడి ఏటిగట్టుపై పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

ముమ్మిడివరం: పంట కాలువల గట్లు ఏటిగట్లు కాలుష్య కారకాలుగా తయారవడంతో పర్యావరణానికి హానికరంగా మారాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంట కాలువ, మాగాం-అయినాపురం పంట కాలువ గట్లపై ఇరువైపులా చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. తూడు, నాచుతో ఉండే ఈ కాలువలు ప్రస్తుతం వేసవి కావడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి, ఉన్న కొద్దిపాటి జలాల్లో చెత్త, ఇతర వ్యర్థాలు కలిసి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. పారిశుధ్య నిర్వహణ చేపట్టాల్సిన పంచాయతీ ఉద్యోగులు, ఏటిగట్ల నిర్వహణను పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ అధికారులు తమది కాదన్నట్టు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్గంధం, ఈగలు, దోమలతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

దంపింగ్ యార్డులుగా ఏటి గట్లు

చిరు వ్యాపారులు పారవేసిన చెత్త, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, ఆసుపత్రుల నుంచి వచ్చిన వ్యర్థాలు, ఇళ్ల వద్ద సేకరించిన చెత్తను కాలువ, ఏటి గట్లపై డంప్ చేస్తున్నారు. కొంతమంది చికెన్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను కాలువగట్లపై వేస్తున్నారు. మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద గౌతమీ గోదావరి ఏటిగట్టు వద్ద పంట కాలువ పక్కన వ్యర్థా పదార్థాలను డంప్ చేయడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారింది. అంతేకాకుండా వ్యర్థ పదార్థాలు కాలువలోకి జారి పంట కాలువ నీరు కలుషితమవుతోంది. ఈ పంట కాలువ దిగవ భాగాన ఉన్న రక్షిత మంచినీటి ప్రాజెక్టులకు నీటిని ఉపయోగిస్తుండటం వల్ల తాగునీరు కూడా కలుషితమయ్యే ప్రమాదముందని పలువురు వాపోతున్నారు. అంతేకాకండా ప్రధాన పుణ్యక్షేత్రమైన కుండలేశ్వరం వెళ్లేందుకు ఏటిగట్టు మార్గం ద్వారా ఇక్కడే ఆటోస్టాండు ఉంది. ఈ ప్రాంతం దుర్గంధ పూరితమవడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



చెత్తా చెదారంతో పూడుకుపోయిన మాగాం - అయినాపురం పంట కాలువ

వెంటనే చర్యలు తీసుకోవాలి



ఏటి గట్లపై చెత్తా చెదారం వేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలి. ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించి ప్రజల నుంచి సేకరించిన చెత్తను ఏటి గట్టుపై వేయకుండా చేయాలి. గట్లపై వేస్తున్న చెత్తవల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవాలి. కాలువలు కలుషితమవకుండా చర్యలు చేపట్టాలి

– కాత్రు అప్పారావు, రైతు, అయినాపురం

ఏటిగట్లను శుభ్రం చేయాలి



వేసవి కాలంలోనే కాలువ గట్లను శుభ్రం చేయాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలి. ముఖ్యంగా వ్యర్థాలను గట్లపై వేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. చెత్త, ఇతర వ్యర్థాలను కాలువ గట్లపై వేయకుండా నియంత్రించాలి.

– కొమ్మిరెడ్డి వీరబ్రహ్మేంద్రస్వామి, రైతు నాయకుడు, గాడిలంక

శ్రీకాంత్‌కు ఘన సత్కారం



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు, నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ పినిపే శ్రీకాంత్‌ను అమలాపురం రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. భట్నవిల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆర్డినేటర్ శ్రీకాంత్‌ను ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, వైస్ ఎంపీపీలు అడపా సుబ్రహ్మణ్యం, పోలమూరి బాలకృష్ణ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీలు పాలగుమ్మి విజయ, చొల్లంగి సుబ్బిరామ్, పరమట నాగమణి, రేవు శ్రీను, గుత్తుల జానకీలక్ష్మి మొసలి స్వర్గన్‌రాజు, వాసంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు కలిసి సత్కరించారు.

చలివేంద్రం ప్రారంభం

ముమ్మిడివరం: ముమ్మిడివరం కార్పొరేషన్ సత్రం ఆధ్వర్యంలో సత్రం ఎదుట చలివేంద్రాన్ని శనివారం సత్రం నిర్వాహకులు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ఓగూరిని సత్కరించిన శ్రీకాంత్



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ శ్రీకాంత్

ఉప్పలగుప్తం: గోపవరానికి చెందిన ఓగూరి విజయ్‌కుమార్ రెండవసారి వైఎస్సార్ సీపీ మండలం యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన పార్టీ కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసారు. శ్రీకాంత్ విజయ్‌కుమార్‌ను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, నాయకులు నడింపల్లి వాసురాజు, ఉండ్రు వెంకటేష్, జనిపెల్ల సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మొరాయించిన ఫ్యాన్లు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్యాన్లు మొరాయించి పనిచేయకపోవడంతో ఇంటి వద్ద నుంచి రోగి బంధువులు స్టాండ్ ఫ్యాన్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రి నిర్వహణ, సౌకర్యాల కల్పనను అధికారులు గాలికి వదిలేసారని, కనీసం ఫ్యాన్లకు మరమ్మతులు చేయించడం లేదని పలువురు రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశ్రాంత ఉద్యోగికి సత్కారం

ఉప్పలగుప్తం: ఏజీ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ పదవీ విరమణ పొంది స్వగ్రామానికి వచ్చిన దోనిపాటి ప్రసాదరావును ప్రముఖ న్యాయవాది డీబీ లోక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం ఘనంగా సత్కరించారు. ప్రసాదరావు హైదరాబాద్‌లో నివసిస్తూ వివిధ గ్రామాల నుంచి ఉద్యోగాల కోసం హైదరాబాద్ వెళ్లిన దళిత యువతీ, యువతులకు ఆయన ఇంట్లో వసతి కల్పించి, సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీబీ లోక్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహాయం

అమలాపురం టౌన్: అల్లవరం మండలం దేవగుప్తం శివారు నల్లగుంట గ్రామానికి చెందిన పెనుమాల వీరవెంకటసత్యనారాయణకు రెండు కిడ్నీలు పాడై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచె వెంకటరమణారావు శనివారం అమలాపురంలోని ఫౌండేషన్ కార్యాలయంలో రూ. 15 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు దాకారపు మహేష్, దడాల అంబేద్కర్, విప్పర్తి దుర్గాప్రసాద్, చిలకపాటి సతీష్, బొంతు చంటి పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



రన్ ఫర్ జీసస్‌ను ప్రారంభిస్తున్న సామ్యూల్ సాగర్

యానాం: గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని ఏసుక్రీస్తు సిలువ, పునరుత్థాన సందేశాలను ప్రకటించేందుకు శనివారం యానాంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ వినూత్న సువార్త సమైక్య పరుగులో పలు గ్రామాల నుంచి క్రైస్తవ విశ్వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రన్ ఫర్ జీసస్‌ను స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో జిల్లా పాస్టర్స్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ, బిషప్ దొమ్మేటి సామ్యూల్ సాగర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఆల్బర్ట్, రిటైర్డ్ విద్యాశాఖాధికారి డేవిడ్‌రాజు, స్టీవెన్, దయ, సుధాకర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వాసవి వనిత క్లబ్ సేవలు ప్రశంసనీయం

యానాం: దివ్యాంగ విద్యార్థుల విద్యాభివృద్ధికి సహాయసహకారం అందిస్తున్న యానాం వాసవి వనితా క్లబ్ సేవలు ప్రశంసనీయమైనవని పలువురు పేర్కొన్నారు. శనివారం స్థానిక రాజీవ్ రివర్ బీచ్ రహదారిలో ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగ ప్రత్యేక పాఠశాలకు యానాం వాసవి వనితా క్లబ్ సమకూర్చిన జారుడు బల్లలు, కుండీలను అందజేశారు. వాసవి ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎమ్ బంగార్రాజు ఈ ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌కుమార్, క్యాబినెట్ సెక్రటరీ సత్తిరాజు, కేవీ సత్యనారాయణ, జోనల్ చైర్ పర్సన్ సీహెచ్ సర్వలక్ష్మీ, వాసవీ ప్రెసిడెంట్ కె శ్రీదేవి, కాశి అన్నపూర్ణ, పి వాణి, జి శ్రీదేవి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 14 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.47 లక్షల చెక్కులను ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మురమళ్లలోని తన క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టేకుముడి లక్ష్మణరావు, గంగ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరశన దీక్ష



ముమ్మిడివరంలో నిరశన దీక్ష చేపట్టిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

ముమ్మిడివరం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో శనివారం ముమ్మిడివరం జిల్లా శాఖల కార్యాలయం ఎదుట నిరశన దీక్ష చేపట్టారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, క్లీనిక్ బకాయిలు తక్షణం చెల్లించి క్రమబద్ధీకరణ చేయాలని, తదితర డిమాండ్లతో నిరశన దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

హిందువులపై దాడులను అరికట్టాలి



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

అమలాపురం రూరల్: పశ్చిమ బెంగాల్లో హిందువులపై జరుగుతున్న దారుణాలు, హింస, హత్యాకాండను వెంటనే అరికట్టాలని, అక్కడ ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినితిపత్రం అందించారు. పశ్చిమబెంగాల్లో రాష్ట్రపతి పరిపాలన వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దేశవ్యాప్తంగా వినతిపత్రాలు అందజేత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, సహ కార్యదర్శి రాజా నాగరత్న కుమార్, రాష్ట్ర భజరంగ్ దళ్ నాయకుడు శిరంగు నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఇన్‌చార్జిల నియామకం

యానాం: వచ్చే ఏడాది ఏప్రిల్‌లో పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీకి ఇన్‌చార్జిలను నియమిస్తూ శనివారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మన్సుక్ మాండవ్యాను ఇన్‌ఛార్జిగా, మరో కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ను కో- ఇన్‌ఛార్జిగా ఎన్నికలు ముగిసే వరకు నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అప్రమత్తతో అగ్నిప్రమాదాల నియంత్రణ



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమలాపురం టౌన్: అప్రమత్తతో వ్యవహరిస్తే అగ్ని ప్రమాదాల నియంత్రణ సాధ్యమవడంతోపాటు తద్వారా ఏర్పడే నష్టాలను తగ్గించవచ్చని అగ్నిమాపక శాఖ సిబ్బంది అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అమలాపురం అగ్నిమాపక శాఖ సిబ్బంది పట్టణంలోని పలు ఆస్పత్రులకు వెళ్లి ప్రమాదాల నియంత్రణపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు ఆధ్వర్యంలో తొలుత స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో అగ్నిమాపక సిబ్బంది ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమక్షంలో యంత్రాలు, పరికరాలతో ప్రయోగాత్మకంగా డెమో ప్రదర్శించి అవగాహన కల్పించారు. తర్వాత ఏఎస్ఏ ఆస్పత్రిలో సిబ్బందిని ప్రమాదాల నివారణపై చైతన్య పరిచారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ప్రజలకు, వాహన చోదకులకు అగ్నిప్రమాదాల జాగ్రత్తలపై ముద్రించిన కర పత్రాలను పంపిణీ చేశారు. లీడింగ్ ఫైర్ మెన్ మట్టపర్తి బలరామ్ ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

శ్రీకృష్ణ విగ్రహ పునఃప్రతిష్ఠకు ఏర్పాట్లు

తాళ్లరేవు: పటవల శివారు కొత్తూరులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో ఆదివారం విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నారు. త్రిదండి శ్రీరంగ రామానుజ జీయర్ స్వామి ఆశీస్సులతో ఉదయం 10.54 గంటలకు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం యాగశాల పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి చంద్రరావు, తణుకు సత్తిబాబు, డేగలజేమ్స్‌బాబు, తణుకు లక్ష్మీ వెంకన్న, యాళ్ల సూర్యభాస్కర్‌రావు, తణుకు సత్యనారాయణ పాల్గొన్నారు.

యూఎస్‌ఏలో యానాం క్రికెటర్ ప్రతిభ

యానాం: అమెరికాలో సెయింట్ ఫ్రాన్సిస్ యూనివర్సిటీలో నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి క్రికెట్ లీగ్ ఫైనల్స్ పోటీలో శనివారం యానాంకు చెందిన క్రీడాకారుడు మంగా సత్యసుమన్ విశేష క్రీడాప్రతిభను కనబర్చినట్టు ఆయన తండ్రి మంగా వీరబాబు తెలిపారు. ఈ సందర్భంగా సత్యసుమన్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికై రూ.15వేల అమెరికన్ డాలర్లను బహుమతి సాధించినట్లు తెలిపారు. సత్యసుమన్ కొన్నేళ్ల క్రితం క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పుదుచ్చేరి టీమ్ తరపున అనేక పరుగులు సాధించి, రాణించాడని స్థానిక పీఈటీలు తెలిపారు.

పారిశుధ్యంపై పర్యవేక్షణ శూన్యం

- పారిశుధ్య పర్యవేక్షణాధికారి ఏఈపై కౌన్సిల్ ఆగ్రహం
- ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్ వెంకటేష్ తాత్కాలిక బాధ్యతలు



ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ హోదాలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న వైస్ చైర్మన్ వెంకటేష్

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించిదని, డ్రెయిన్లలో సిల్ట్ పెరిగిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పారిశుధ్య విభాగాన్ని పర్యవేక్షిస్తున్న ఏఈ వెంకటేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి వ్యక్తిగత కారణాలతో సమావేశానికి హాజరుకాకపోవడంతో వైస్ చైర్మన్-1 తిక్కిరెడ్డి వెంకటేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వెంకటేష్ ఇన్‌చార్జి చైర్మన్‌గా తాత్కాలికంగా వ్యవహరించి తొలుత చైర్‌పర్సన్ చాంబర్‌లో చైర్మన్ కుర్చీలో ఆశీనులై కొద్దిసేపు కౌన్సిలర్లతో చర్చించారు. అనంతరం చైర్మన్ పీఠంపై కూర్చుని మున్సిపల్ సమావేశాన్ని కొనసాగించారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ సమావేశంలో పాల్గొని పలు ప్రజా సమస్యలపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, డీఈఈ సీహెచ్. నాగ సతీష్ ఎమ్మెల్సీలు, కౌన్సిలర్లు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు.

మస్టర్ల మాయాజాలాన్ని పట్టించుకోండి

మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగం తీరుపై పాలక పక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము అధికారులను నిలదీశారు. కొందరు పారిశుధ్య కార్మికులు రోజూ ఉదయాన్నే మస్టర్ల వేయించుకుని తర్వాత విధులకు గైర్హాజరవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. తర్వాత ప్రతిపక్ష కౌన్సిలర్లు పిండి అమరావతి, బొర్రా వెంకటేశ్వరరావు ఇదే సమస్యపై అధికారులు తీరును ఎండగట్టారు. 29వ వార్డులో ఎనిమిది నెలల్లో కేవలం నాలుగు సార్లే డ్రెయిన్లను శుభ్రం చేశారని ఆ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో డ్రెయిన్లలోని పూడిక తొలగించాలని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ సూచించారు. కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను మాట్లాడుతూ వాటర్ వర్క్స్‌లో పనికి రాని పాత ఇనుము పేరుకుపోయినా దానిని విక్రయించడంపై ఎందుకు జాప్యం చేస్తున్నారని నిలదీశారు. 27వ వార్డులో అర్బన్ హెల్త్ సెంటరు-2 తదితర అభివృద్ధి పనులు పూర్తయినా ఇంకా ఎందుకు ప్రారంభించలేదని ఆ వార్డు కౌన్సిలర్ బంగారు గోవిందు ప్రశ్నించారు.

స్క్రాప్ అంశాన్ని ఎవరు అడ్డుకున్నారంటూ ఆగ్రహం

అజెండాలోని 41, 42 అంశాలైన మున్సిపాలిటీలో పేరుకుపోయిన పాత ఇనుము (స్క్రాప్) చర్చకు వచ్చినప్పుడు పాలక పక్షం కౌన్సిలర్ నాగేంద్ర అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్క్రాప్ వేలం పాట విషయంలో ఎవరు జోక్యం చేసుకుని నిలుపుదల చేశారని అధికారులను నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త జోక్యం చేసుకున్నారని సిబ్బంది చెప్పగానే నాగేంద్ర తదితరులు ధ్వజమెత్తారు.

ఇన్‌చార్జి చైర్మన్ వెంకటేష్‌కు అభినందనలు

ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్‌చైర్మన్ వెంకటేష్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ పీఠంపై కూర్చోగానే ఆయనను ఎమ్మెల్సీలు, పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. తర్వాత ఎమ్మెల్సీలు, కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ చేశారు.

స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని సాకారం చేయాలి



ముమ్మిడివరంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీ మాథుర్, ఎమ్మెల్యే దాట్ల

ముమ్మిడివరం: స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా ప్రజలంతా చేయిచేయి కలిపి సాకారం చేయాలని అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎంపీ మాథుర్‌తో పాటు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌తో కలసి పాల్గొన్నారు. నగర పంచాయతీ ఉద్యోగులు, నాయకులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముమ్మిడివరం శివారు మట్టాడిపాలెం, పల్లంకుర్రులో నిర్మిస్తున్న 33బై 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు వారు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేచెల్లి వివేకానంద, చెల్లి అశోక్, గుత్తుల సాయి, పెన్మత్స జగప్పరాజు, తాడి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

అమలాపురం రూరల్: పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, సర్పంచ్ నక్కా అరుణకుమారి పేర్కొన్నారు. కామనగరువు గ్రామ పరిధి బాలయోగి కాలనీలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నబాబు, కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు తదతరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయం వద్ద..

ఐ.పోలవరం: దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ ఆలయ అధికారులు చేశారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ఆలయ ధార్మిక కార్యాలయం సిబ్బంది శనివారం ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేసిన వైద్యులు

అమలాపురం టౌన్: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి పరిసరాలను వైద్యులు, సిబ్బంది శనివారం శ్రమదానం చేసి పరిశుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బందితోపాటు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, సామాజిక కార్యకర్త వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డీఐఈవో వనుము సోమశేఖరరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.

కాలేయ ఆరోగ్యంపై అవగాహన సదస్సు

అమలాపురం రూరల్: వరల్డ్ లివర్ డే సందర్భంగా శనివారం కిమ్స్, మెడ్ యునైటెడ్ ఆసుత్రులు వాకర్స్ క్లబ్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్ నుంచి అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పిటల్ వరకు కాలేయ పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. మెడ్ యునైటెడ్ హాస్పిటల్ ప్రాంగణంలో ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు ఎస్.సుదీర్, మెడికల్ గాస్ట్రోఎంటరాలజిస్ట్ కే.పి.ఆర్.కిషోర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కిమ్స్ డీన్ ఆనంద్ ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ పి.సుబ్బారావు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే పనులను వేగవంతం చేయండి

అమలాపురం టౌన్: కోటిపల్లి -నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణ పరంగా ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి పనులు వేగవంతమయ్యేలా కృషి చేయాలని కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్ఎస్ఎస్) ప్రతినిధులు స్థానిక అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ హరీష్‌ను కేఆర్ఎస్ఎస్ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధుల బృందం కలసి రైల్వే లైన్ నిర్మాణంలో నెలకొన్న జాప్యంపై చర్చించారు. కేఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పోలిశెట్టి శివాజీ, ఎరగట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జయంతిరావుకు ఘన నివాళి

ఉప్పలగుప్తం: పేదల అభ్యున్నతి కోసం పరితపించిన సమాజ సేవకుడు రేవు జయంతిరావు అని పలువురు దళిత నాయకులు కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జయంతిరావు ఐదవ వర్ధంతి సందర్భంగా శనివారం ఎస్.యానాంలో పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, చల్లపల్లి సర్పంచ్ ఇసుకపట్ల జయమణి తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుపై వాహనాలు ఢీ

అమలాపురం రూరల్: కామనగరువ బైపాస్ రోడ్డులో ఫ్లైఓవర్ వద్ద శనివారం రెండు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంతో స్వల్పగాయాలతో అందరూ బయటపడ్డారు. ముమ్మిడివరం నుంచి వై జంక్షన్ వైపునకు వెళుతున్న కారు కామనగరువు ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి చిట్టమ్మ చెరువు ఫ్లైఓవర్ కింద రోడ్డు నుంచి బైపాస్ వైపునకు వెళుతుండగా వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్పగాయమైంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పల్లిపాలెంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు



స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కన్నుల పండువగా స్వామివారి కల్యాణం

ముమ్మిడివరం: అలివేలుమంగ, పద్మావతి సమేత స్వామివారి కల్యాణోత్సవం శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ముమ్మిడివరం శివారు పల్లిపాలెం శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయ 8వ వార్షికోత్సవాల సందర్భంగా బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం మహాగణపతి పూజ, స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, స్వామి అమ్మవార్లకు 108 కలశాల సప్త నదీ జలాలలో మంగళస్నానం, సాయంత్రం ఐదు గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ, ఉదయ 9 గంటలకు స్వామి అమ్మవార్లకు దివ్య కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి పెన్మత్స కుటుంబీకులు పట్టు వస్త్రాలు, సారె, అల్లూరి వారి కుటుంబీకులు అమ్మవార్లకు చీర సారె సమర్పించారు. సాయంత్రం ఐదు గంటలకు వివిధ హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కల్యాణ మహోత్సవంలో పాల్గొనగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ నిర్వాహకులు పెన్మత్స చిట్టిరాజు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్, పలువురు ప్రముఖులు స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు పుష్కరిణిలో స్వామివారి చక్ర స్నానం, సాయంత్రం పుష్పోత్సవం, పవలింపు సేవ ఉంటుందని ఆలయ నిర్వాహకులు పెన్మత్స చిట్టిరాజు తెలిపారు.